

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 05-10-2025 సంపుటి: 07 సంచిక: 146 పేజీలు: 8 వెల: రూ 3-00


# సోషల్ మీడియా ట్రోల్స్‌తో జన్‌నాయక్‌లు కాలేరు..

## రాహుల్‌పై మోదీ విసుర్లు




న్యూఢిల్లీ: బీహార్ విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఎన్డీయే ప్రభుత్వానికి దక్కుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆర్జేడీ-కాంగ్రెస్ హయాంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించే యువశక్తిని సన్నద్ధం చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్యంతో ఉందన్నారు. సోషల్ మీడియా ట్రోల్స్‌తో ఎవరూ 'జన్‌నాయక్' కాలేరని, ప్రజల ప్రేమాభిమానాలు, గౌరవం చూరగొంటేనే అది సాధ్యమని పరోక్షంగా రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. రూ. 62,000 కోట్ల విలువైన విద్యా ప్రాజెక్టులను ప్రధానమంత్రి బుధవారంనాడిక్కడ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బిహార్‌లో నేడు మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలను పునర్నిర్మిస్తూ, ఉన్నత విద్యా సంస్థలను విస్తరిస్తూ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఆర్జేడీ హయాంలో విద్యావకాశాలు లేక ప్రజలు వలసల బాట పట్టేవారని, లెక్కకు మిక్కిలిగా కుటుంబాలు తమ పిల్లలను చదువుల కోసం, పనుల కోసం ఇతర రాష్ట్రాలకు పంపేవారని చెప్పారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఓబీసీల ఆరాధ్యదైవం జననాయక్ కర్పూరి ఠాకూర్ వారసత్వాన్ని ఆపాదించుకునేందుకు కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారని, సోషల్ మీడియా ట్రోల్స్‌తో ఎవరూ జన్‌నాయక్‌లు కాలేరని, ప్రజల మనస్సుల్లో స్థిరమైన ముద్ర వేసుకున్న నేతలకే ఆ పేరు చెల్లుతుందని అన్నారు. గత ఏడాది కర్పూరి ఠాకూర్‌కు తమ ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో గౌరవించుకుందని, సామాజిక న్యాయం, విద్య ద్వారా సాధికారతకు పాటుపడిన కర్పూరి ఠాకూర్ పేరు చిరస్థాయిగా నిలిపేందుకు బిహార్‌లో జన్ నాయక్ కర్పూర్ ఠాకూర్ స్కిల్ యూనివర్శిటీని ప్రారంభించామని చెప్పారు.ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం-సేతు పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్య, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తారు. బిహార్‌లో 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయతా భట్ట యోజన'ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ పథకం కింద సుమారు 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు ఉచిత స్కిల్ ట్రైనింగ్‌తో పాటు రెండేళ్ల పాటు రూ. 1,000 చొప్పున అలవెన్స్ ఇస్తారు. రీడిజైన్డ్ బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను కూడా ప్రధాని ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ పథకం కింద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం రూ. 4 లక్షల వరకూ వడ్డీలేని విద్యా రుణాలు ఇస్తారుబిహార్ ప్రభుత్వం గత రెండు దశాబ్దాల్లో కల్పించిన ఉద్యోగావకాశాలకు రెట్టింపు ఉద్యోగావకాశాలు రాబోయే ఐదేళ్లలో కల్పించనున్నట్టు ప్రధాని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే 10 లక్షల శాశ్వత ఉద్యోగాలు, 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించినట్టు తెలిపారు.




అమరావతి, అక్టోబర్ 4: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. అవసరమైతే తవిజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.అల్లూరి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రఖర్ జైన్ తెలిపారు. 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఎవరూ చెట్ల కింద ఉండవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.కాగా, ఇప్పటికే వర్షాల దెబ్బకు ఉత్తరాంధ్ర జిల్లాలు వణికిపోతున్నాయి. వంశధార, నాగవళి నదులు పొంగి పలువురు ప్రాణాలు కోల్పోగా.. మరికొంతమంది నిరాశ్రయులు అయ్యారు. నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

# ఆటో డ్రైవర్లకు కలెక్టర్ రాజకుమారి భరోసా

## జిల్లాలో 10,006 మందికి రూ.15.90 కోట్లు జమ





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-:ఆటో డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని కాపాడుకుంటూ పిల్లల చదువుపై శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. నంద్యాల టౌన్ హాల్‌లో నిర్వహించిన "ఆటో డ్రైవర్ల సేవలో" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.జిల్లాలో 10,006 మంది ఆటో డ్రైవర్లకు రూ. 15 కోట్లు 90 వేల రూపాయలు ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.90 లక్షల ఆటో డ్రైవర్లకు రూ. 436 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు.ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు, ట్రాఫిక్ నియమాల పాటన, 40 ఏళ్లు దాటిన వారు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహక మొత్తాన్ని రిపేర్లు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికేట్లకు వినియోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, పీఎం కిసాన్ వంటి పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి విజయవాడలో ప్రారంభించిన పథకం లైవ్ ప్రసారాన్ని వీక్షించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఉప రవాణా అధికారి శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎం చంద్రబాబు




అమరావతి, అక్టోబరు4 : 2024 ఎన్నికలు తన చరిత్రలో ఎప్పుడూ చూడలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ ద్వారా దేశంలో ఎక్కడా ఇవ్వనన్ని సంక్షేమ పథకాలు ఇచ్చిన రాష్ట్రం ఏపీ అని ఉద్ఘాటించారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'ఆటో డ్రైవర్ సేవలో' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు సీఎం చంద్రబాబు. సెల్‌ఫోన్లు చూసుకోండి డబ్బులు వచ్చాయా.. చూసుకున్నారా.. కన్ఫర్మేషన్ మెసేజ్‌లు అందుకున్నారా.. అని సీఎం ఆటో డ్రైవర్‌లని అడిగారు. అవును రూ. 15 వేలు వచ్చాయని ఆటోడ్రైవర్‌లు సీఎంకు సమాధానం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి నారా లోకేష్‌లు, కూటమి నేతలు, ఆటో డ్రైవర్లు భారీగా పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. అవినీతి లేకుండా పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ. 15 వేలు చొప్పున జమ చేస్తున్నామని ప్రకటించారు. వైసీపీ హయాంలో ఆటో డ్రైవర్లు ఎంతో ఇబ్బంది పడ్డారని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి వ్యవస్థలన్నీ అగమ్యగోచరమని తెలిపారు సీఎం చంద్రబాబు.

పాలనను గాడిలో పెడుతున్నాం..

ఒక్కో వ్యవస్థను చక్కబెడుతూ పాలనను గాడిలో పెడుతున్నామని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చాకే రోడ్లు బాగుచేశామని వివరించారు. స్త్రీశక్తికి ముందే ఆటో డ్రైవర్ల గురించి ఆలోచించామని తెలిపారు. ఆటో డ్రైవర్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. పేదల ఆరోగ్యం కాపాడే బాధ్యత తీసుకుంటామని వెల్లడించారు. యునివర్సిల్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో అందరినీ ఆదుకుంటామని తెలిపారు. రూ. 25 లక్షల వరకు హెల్త్ పాలసీ వర్తించేలా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని నొక్కిచెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 750 సేవలు నేరుగా అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌ల పండుగ..

'ఓజీ సినిమా చూశారు.. దసరా పండుగ చేసుకున్నారు. విజయవాడ ఫెస్టివల్ చాలా బాగా జరిగింది. ఈరోజు ఆటో డ్రైవర్‌ల పండుగలో ఉన్నాం. ఆయుధ పూజ తరహాలో వాహన పూజ చేశారు. ఆటో డ్రైవర్‌లు పేమెంట్లు అన్ని సెల్‌ఫోన్ ద్వారానే చేస్తున్నారు. ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేదు.. చెప్పిన రోజు చెప్పినట్లుగా పనిచేసే ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం. ఆటోడ్రైవర్లకు ఎన్నో కష్టాలు ఉన్నాయి... రోడ్లు అన్ని అధ్వానంగా ఉన్నాయి. నేను, పవన్ కల్యాణ్ , బీజేపీ కలిసి ఎన్డీఏ కూటమిని గెలిపించాలని పిలుపు ఇచ్చాం. 94శాతం స్ట్రైయిక్ రేటు వచ్చింది. రానున్న రోజుల్లో ఈ స్ట్రైయిక్ రేటు పెరగాలి. 16 నెలల క్రితం అంతా అగమ్య గోచరం. రాత్రి, పగలు ఆలోచించాం. ఏపీని కాపాడటానికి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వచ్చాం. చరిత్రలో ఎప్పుడైనా ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చూశారా. 175 నియోజకవర్గాలల్లో ఆటో డ్రైవర్‌ల పండుగ జరుగుతోంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# యాగి చేయాలనేదే జగన్ ఆలోచన.. మంత్రి ఫైర్

విశాఖపట్నం, అక్టోబర్ 4: విశాఖ వీఎంఆర్‌డీఏ ఏరినాలో ఆటో డ్రైవర్ల సేవా పథకం కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సేవా పథకం కింద ఈరోజు రూ. 15000 అందిస్తున్నామని తెలిపారు. ఆటో సోదరులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం 15 వేల రూపాయలను అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే ప్రభుత్వమని స్పష్టం చేశారు. వైసీపీ నేతలకు పీపీకి ప్రైవేట్ పరానికి అర్థం తెలియడం లేదని విమర్శించారు.వైసీపీ ప్రభుత్వంలో కేవలం 18 శాతం మాత్రమే మెడికల్ కాలేజ్ పనులు జరిగాయని.. వాటితో మెడికల్ కాలేజి నిర్వహణ మొదలుపెట్టలేమని చెప్పారు. కేవలం జగన్మోహన్ రెడ్డి ఇంటికే పరిమితం అయిపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి రారని.. ప్రజా సమస్యలు పట్టించుకోరని.. ఏదో రకంగా యాగి చేయాలనే ఆలోచన చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇప్పటికే ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని.. అయినా వారి మనస్తత్వాలు, వారి వ్యవహారాల ధోరణి మారలేదంటూ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శలు గుప్పించారు.






# సంపాదకీయం

ఆదివారం 05-10-2025

## కరూర్ లాంటి ఘటనలు ఆపలేమా ?

దేశంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలు నానాటికీ శృతి మించుతున్నాయి. ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయింది. ప్రజలను ఏమార్చడం, సెంటిమెంట్లను రెచ్చగొట్టడం, అధికారం సంపాదించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల విన్యాసాలు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్‌ను వేసింది. దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికి తీసినా అందుకు కారకులైన ఆ పార్టీ వారిమీద ఎలాంటి చర్యలు ఉంటాయన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఇలాంటి ఘటనలు చూశాం. ఎపిలో చంద్రబాబు హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా పదుల సంఖ్యలో చనిపోయారు. జగన్ మొన్నటికి మొన్నర్యాలీలో ఒకరిద్దరు చనిపోయారు. రాజకీయ నేతల హత్యలుగా వీటిని పరిగణించి చర్యలు తీసుకుని ఉంటే కరూర్ ఘటన జరిగివుండేది కాదు. భారీగా బహిరంగ సభలు నిర్వహించడం, ర్యాలీలు చేపట్టడం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అయినా ఆయా పార్ఈల నేతల్ల్లో కించిత్తు కూడా పశ్చాత్తాపం లేదు. తమిళనాడు కరూర్‌లో టివికె నాయకుడు, సినీ నటుడు విజయ్ సభలో చోటుచేసుకున్న మహా విషాదం మాటలకందనిది. నిర్వాహకుల భద్రతా లోపాలే తొక్కిసలాటగా మారి 41 మంది ప్రాణాలను బలిగొనడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ఇలాంటి ర్యాలీలు చేపట్టి ఏం ఉద్ధరిస్తారన్నది ప్రజలు కూడా ఆలోచించాలి. వీరంతా మన ఓట్లను కొల్లగొట్టే యంత్రాలని గుర్తించాలి. మనదగ్గర ఓటు ఆయుధం ఉందని గుర్తించి మసలుకోవాలి. నటుడు విజయ్‌ను చూడడానికి వచ్చిన 41మంది చనిపోతే ఆ కుటుంబాలు ఏం కావాలి. తీవ్రంగా గాయపడిన 80 మందిలో ఐదుగురి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా అణగారిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారే. వారిని ఆదుకునేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పడం లేదు. వారి కుటుంబాలకు భరోసా ఎవరు ఇస్తారో చెప్పడం లేదు. పోలీసులు ఇలాంటి ర్యాలీలకు అనుమతి ఇచ్చేముందు ఎందుకు ఆలోచించరన్నది కూడా ముఖ్యమే. హీరో విజయ్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీకెండ్ రోడ్ షోలు ప్రారంభించారు. విజయ్ ను చూసేందుకు అత్యధిక సంఖ్యలో సభలకు తరలివస్తున్నారు. వారికి తగిన భద్రత కల్పించడం, వారు ఇళ్లకు క్షేమంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం నిర్వాహకుల బాధ్యత. అలాంటి బాధ్యతలను గాలికి వదిలేయడంతో తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారంటూ టివికె పార్టీ చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందుకంటే ఇలాంటి ర్యాలీలు నిర్వహించి ఏం చేస్తారన్నది చెప్పాలి. తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ఆస్తుల విధ్వంసం చేస్తున్న వారిపై నిర్వాహకులకు నియంత్రణ ఉండటం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో నాలుగు రోజుల క్రితమే వాదనలు వినిపించాయి. ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా సభల నిర్వాహకుల నుంచి డిపాజిట్లు వసూలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో మార్గదర్శకాలపై నివేదిక సమర్పించాలంటూ ధర్మాసనం ఆదేశించినా, సరైన జాగ్రత్తలు తీసుకోలేదనడానికి కరూర్ ఉదంతమే సాక్ష్యం. కరూరులో అభిమానులు రాత్రి 7.30 గంటలకు విజయ్ వచ్చేవరకూ ఎండలో, కనీసం తాగునీళ్లిచ్చే దిక్కులేక, ఆహారం లేక అలమటించాల్సి వచ్చింది. 10 వేల మంది సభకు వస్తారని నిర్వాహకులు అనుమతి తీసుకుని, 30 వేల మందికిపైనే మూడు జిల్లాల నుంచి సమీకరించారు. విజయ్ ను దగ్గర నుంచి చూడాలంటూ కొందరు అభిమానులు చెట్టు ఎక్కగా, ఆ చెట్టు కొమ్మ విరిగిపడటమే తొక్కిసలాటకు కారణమని చెబుతున్నారు. నీరసంగా ఉన్న అభిమానుల కోసం విజరు తన కాన్వాయ్ నుంచి నీళ్ల సీసాలు విసరడం, కొందరు అత్యుత్సాహంతో కాన్వాయ్ వద్దకు తోసుకెళ్లడమూ గందరగోళానికి కారణమైందంటున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు చేరుకోవడం, నిర్వాహకులు, స్థానిక అధికారుల మధ్య గందరగోళం, నిర్వహణాలోపమే ఘటనకు ప్రధాన కారణం. వెనువెంటనే సంఘటనా స్థలానికి సిఎం వచ్చి, పరామర్శించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం, మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అందించడం, నష్టపరిహారం ప్రకటించడం ఉపశమనం కలిగించేవే! రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. పరిహారం ప్రకటించిన విజయ్ బాధిత కుటుంబాలను పరామర్శించకుండా వెనుదిరగడమూ చర్చనీయాంశమైంది. దీనిని మద్రాస్ హైకోర్టు కూడా తప్పు పట్టింది. ఇక వారే సిబిఐ విచారణ కోరడం మరీ దారుణం. ఆయన కానీ, వారి పార్టీ నాయకులు గానీ క్షతగాత్రులకు వైద్యమందించిన ఆసుపత్రులకైనా వెళ్లకపోవడం శోచనీయం. రాజకీయ సభలైనా, మతపరమైనవైనా, ఏ కార్యక్రమమైనా? అక్కడికి వచ్చే ప్రజల ప్రాణాలను కాపాడి, క్షేమంగా ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత నిర్వాహకులదే. ఇరుకుగా ఉండే ప్రదేశాలను జనాకర్షణ కలిగిన నేతల భారీ సభల కోసం, రోడ్‌షోల కోసం వినియోగించకుండా, విశాల ప్రదేశాల్లోనే సభలు నిర్వహించేలా చూడటం అవసరం. పదుల సంఖ్యలో అమాయక ప్రజల మరణానికి కారణమైన ఇటువంటి తొక్కిసలాట ఘటనల సందర్భంగా జరిగిన నిర్వహణ వైఫల్యాలు, పాలనా యంత్రాంగం లోపాలు వంటివి సమీక్షించి, తగు చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

## రేవంత్ రెడ్డి పక్కా దొంగనే.. నిప్పులు చెరిగిన హైడ్రా బాధితురాలు



హైదరాబాద్ : హైదరాబాద్ వాసులకు హైడ్రా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. అర్ధరాత్రి వేళ బస్తీలపై హైడ్రా బుల్డోజర్లు విరుచుకుపడుతున్నాయి. నిరుపేదల గుడిసెలను, రేకుల ఇండ్లను నేలమట్టం చేస్తూ.. వారి కడుపును కొడుతున్నారు హైడ్రా అధికారులు. మొన్న బతుకమ్మ పండుగ మొదటి రోజే గాజుల రామారంలో కూల్చివేతలు చేపట్టి పేదలకు నిలువ నీడ లేకుండా చేసిన హైడ్రా సిబ్బంది.. నేడు దసరా పండుగ తెల్లారే కొండాపూర్‌లో నిరుపేదలకు చెందిన పలు నిర్మాణాలను తొలగించారు.కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. శనివారం తెల్లవారుజామునే బుల్డోజర్లు, ప్రొక్లైనర్లతో వచ్చిన అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు.ఈ సందర్భంగా బాధిత మహిళలు సీఎం రేవంత్ రెడ్డితో పాటు హైడ్రా అధికారులపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి దొంగ కాబట్టే చీకట్ల వచ్చి ఇండ్లు కూలగొట్టిండు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ ఇచ్చిన భూములు కాంగ్రెస్ ప్రభుత్వమే లాక్కుంటుంది. రేవంత్ రెడ్డి పక్కా దొంగ కాబట్టే.. తెల్లవారుజామున 4 గంటలకు మా ఇండ్లపైకి హైడ్రా బుల్డోజర్లను పంపించాడని ధ్వజమెత్తారు.చివరకు రేవంత్ రెడ్డి మెడలో చెప్పుల దండలు వేస్తాము అని మహిళలు మండిపడ్డారు. ఈ భూమి అప్పట్లో ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకుంటే ఇందిరా గాంధీ ఇచ్చింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి లాక్కుంటున్నాడు అని మహిళలు కన్నీరు పెట్టుకున్నారు.

## కరూర్ ఘటనే అవకాశంగా బీజేపీ ఎన్నికల వ్యూహం.. టీవీకేకి కీలక హామీ..?

న్యూఢిల్లీ: కరూర్ తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. గతనెల 27న కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన వెనుక కుట్ర కోణం ఉందని టీవీకే ఆరోపిస్తోంది. అయితే, అధికార డీఎంకే మాత్రం విజయ్‌నే నిందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ తొక్కిసలాట ఘటనను పలు రాజకీయ పార్టీలు 2026 అసెంబ్లీ ఎన్నికలకు ఓ అవకాశంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి.తొక్కిసలాట ఘటనతో తమిళ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ ఘటనను ఓ అవకాశంగా మార్చుకునేందుకు ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఇందులో భాగంగానే విజయ్ పార్టీతో బీజేపీ నేతలు సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టాలని భావిస్తున్న కాషాయ పార్టీకి ఈ ఘటన ఓ అవకాశంగా మారినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు విజయ్ ఫ్యాన్ బేస్‌ను ఉపయోగించుకోవాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం తొక్కిసలాట ఘటనతో విమర్శలు ఎదుర్కొంటున్న విజయ్‌కి అండగా నిలబడినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. విజయ్‌ని డీఎంకే లక్ష్యంగా చేసుకుందని బీజేపీ వర్గాలు టీవీకే నాయకులతో అన్నట్లు సమాచారం. విజయ్ ఒంటరి కాదని అండగా ఉంటామని కూడా హామీ ఇచ్చినట్లు టాక్.తొక్కిసలాట ఘటనలో డీఎంకేనే ఇరుకున పెట్టాలని టీవీకేకి కమలం పార్టీ నేతలు సూచించినట్లు సమాచారం. అంతేకాదు, తొక్కిసలాట సంక్షోభం నుంచి బయటపడేందుకు ఓపికగా ముందుకు వెళ్లాలని కూడా సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, రాష్ట్రంలో ఏఐఏడీఎంకేతో పొత్తులో ఉన్న బీజేపీ ఆ పొత్తు దెబ్బతినకుండా జాగ్రత్తగా ముందుకు వెళ్తోంది. బీజేపీతోపాటూ కాంగ్రెస్ కూడా టీవీకేని సంప్రదించినట్లు తెలిసింది. డీఎంకే, ఏఐఏడీఎంకే ఆధిపత్యం వహిస్తున్న తమిళ రాజకీయాల్లో తమ ముద్ర వేసుకునేందుకు జాతీయ పార్టీలు కరూర్ ఘటనను ఓ అవకాశంగా భావిస్తున్నాయనడానికి ఇది నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో టీవీకే ఒంటరిగానే పోటీ చేస్తుందని విజయ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తాజా పరిస్థితుల్లో ఆయన తన వ్యూహాలు మార్చుకునే అవకాశం లేకపోలేదు.



## ఆమెరికాలో కాల్పులు.. హైదరాబాద్‌కి చెందిన విద్యార్థి మృతి

హైదరాబాద్: అమెరికాలో పెరిగిపోతున్న గన్ కల్చర్ మరో అమాయకుడిని బలి తీసుకుంది. డల్లాస్‌లో నగరంలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి మృతి చెందాడు. ఎల్బీ నగర్ పరిధిలోని బిఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బిడిఎస్ పూర్తి చేసి.. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాడు. అయితే నేటి తెల్లవారుజామున దుండగుడి కాల్పుల్లో అతను కన్నుమూశాడు. కాల్పులకు పాల్పడింది ఓ నల్ల జాతీయుడని సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం స్పందించాల్సి ఉంది.సాంస్కృతిక కార్యక్రమాల టికెట్లు చరిత్ర పుస్తకాలు వ్యాపార సలహాలు ఈ ఘటనపై మంత్రి హరీశ్ రావు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. బాధిత కుటుంబాన్ని వాళ్ల ఇంటికి స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో వెళ్లి ఆయన పరామర్శించారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో ఉంటాడనుకున్న కొడుకు ఇక లేడు అన్న విషయం తెలిసి ఆ తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన చూసి గుండె తరుక్కుపోతుందని పేర్కొన్నారు. వారి కుటుంబాని తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని చంద్రశేఖర్ మృతదేహాన్ని త్వరగా స్వస్థలానికి తరలించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.



## గద్వాల్ లో రోడ్డు ప్రమాదం

జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గద్వాల్ నుండి కర్నూలు వైపు వెళ్తున్న కారు జింకలపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. బస్సు కారును 100 మీటర్ల దూరం ఈడ్చుకెళ్ళింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా ఆపడం వలన కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో వాహనంలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వాహనదారులు కారు డోర్ ను బలవంతంగా ఓపెన్ చేసి అందులో ఉన్న వారిని బయటకు తీశారు. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో అందరూ సురక్షితంగా ఉన్నారు. కారు అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు కర్నాటక రాష్ట్రానికి చెందిన వాహనంగా గుర్తించారు. క్రేన్ సహాయంతో బస్సు నుంచి కారును పక్కకు తొలగించారు.




## ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆరెంపుల యువతి పల్లవి అవార్డు స్వీకరణ




ఖమ్మం రూరల్, అక్టోబర్ 04 : ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఆరెంపులకు చెందిన యువతి తాళ్లూరి పల్లవి శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆమె ఈ అవార్డును అందుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధానమంత్రి సేతు పథకాన్ని రూ.60 వేల కోట్లతో ప్రారంభించారు. దీనిలో భాగంగానే అత్యుత్తమ నైపుణ్యం కనపరిచిన పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. దీనిలో భాగంగానే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్‌గా ఎన్నికైన తాళ్లూరి పల్లవికి ప్రదాని అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పల్లవి తల్లిదండ్రులు తాళ్లూరి రవి, అజిత ఆనందం వ్యక్తం చేశారు.

## పేకాట ఆడితే జైలుకే.. జీవితాలు పాడు చేసుకోవద్దు : సీఐ వెంకట్ రెడ్డి



సిర్గాపూర్, అక్టోబర్ 04 : దీపావళి పండుగ ఉందని గ్రామాల్లో పేకాట ఆడితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని కంగ్టి సీఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడైనా పేకాట ఆడితే ఆ స్థలం యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని చెప్పారు. పేకాట వల్ల వచ్చేది ఏమీ ఉండదని, అనవసరంగా జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు.తాగుడుకు బానిసై చివరికి అప్పులు చేసి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని చెప్పారు. పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని సిర్గాపూర్, కల్హేర్, కంగ్టి మండలాల ప్రజలకు సీఐ వెంకట్ రెడ్డి సూచించారు.

## బిడ్డపై అనుమానం.. రెండు చేతులు వెనక్కి కట్టి కాలువలో తోసేసిన తండ్రి..!



హైదరాబాద్ : కనిపెంచిన బిడ్డపట్ల ఓ తండ్రి కర్కషంగా వ్యవహరించాడు. ఆమె ఎవరితోనో సంబంధం పెట్టుకుందనే అనుమానంతో దారుణానికి పాల్పడ్డాడు. ఆమె రెండు చేతులు వెనక్కి విరిచి కట్టి తీసుకెళ్లి, ఓ కాలువలో తోసేశాడు. ఆమె కన్నతల్లి 'నా బిడ్డా.. నా బిడ్డా..' అని కేకలు వేస్తూ గుండెలు బాదుకున్నా అతడు పట్టించకోలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్‌పూర్ జిల్లాకు సుర్జీత్ సింగ్ భార్య, కుమార్తె కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో కుమార్తె ప్రవర్తనను సుర్జీత్ అనుమానించాడు. ఆమె ఎవరితోనో సంబంధం పెట్టుకుందని అనుమానించాడు. కుమార్తె తీరును అవమానంగా భావించిన అతడు.. ఆమె రెండు చేతులు వెనక్కి విరిచి కట్టి కాలువలో తోసేశాడు.భార్య వారించినా పట్టించుకోలేదు. బాలిక కాలువలో కొట్టుకుపోయిన తర్వాత 'నా బిడ్డ ఏమైంది.. నా బిడ్డ ఏమై పోయింది..?' అని గుండెలు బాదుకుంటూ ఆమె రోదించింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, నిందితుడి భార్య నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. కాలువలో గల్లంతైన బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## కొండపూర్లో దాదాపు రూ.3600కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

### 36 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొగించిన హైడ్రా

హైదరాబాద్, అక్టోబర్ 04: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం లోని కొండాపూర్లో దాదాపు రూ.3600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉంది. ఆ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హై కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణల తొలగింపును హైడ్రా చేపట్టింది. అందులో తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించిన హైడ్రా. భారీ బందోబస్తు మధ్య అక్కడ షెడ్డులను తొలగించిన హైడ్రా. ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.

## అరణి శ్రీనివాస్ కు తప్పని పాత వాసనలు

తిరుపతి, అక్టోబరు 4, తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహంగా ఉన్నట్లు కనిపిస్తుంది. వైసీపీ నుంచి వచ్చి పార్టీలో చేరినా ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు. పొత్తులో భాగంగా రాయలసీమలోని తిరుపతితో పాటు రైల్వే కోడూరు నియోజకవర్గాలను ఎంచుకున్నారు. చంద్రబాబు నాయుడు కూడా నాడు పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు. దీంతో కూటమి గాలిలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్ లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. మరొకవైపు వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు కూడా ధీటుగా ఆరణి శ్రీనివాసులు స్పందించక పోవడం కూడా ఆరణిపై ఆగ్రహానికి కారణమయిందంటున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానంపై ఆరోపణలు, విమర్శలు చేస్తున్నప్పటికీ పాత పరిచయాలతో ఆరణి శ్రీనివాసులు స్పందించడం లేదన్న అనుమానం పార్టీ నాయకత్వంలో వక్తమవుతుంది.. ఇటీవల తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లాస్ పీకారని తెలిసింది. ఇలాగైతే ఎలా.. కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలను కలుపుకుని పోవాలని పవన్ కల్యాణ్ చెప్పారట. పాత పరిచయాలుంటే వాటిని వదిలేయాలని, జనసేనలో కొనసాగాలనుకుంటే మారాలని ఆరణి శ్రీనివాసులుకు పవన్ కల్యాణ్ ఒకింత సీరియస్ గానే చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆరణి శ్రీనివాసులు ఇటీవల భూమన కరుణాకర్ రెడ్డి చేసే విమర్శలకు స్పందిస్తున్నారనితెలిసింది. మరొకవైపు తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతల నుంచి కూడా పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు ఆరణి శ్రీనివాసులుపై పవన్ కల్యాణ్ ఒక కన్నేసి ఉంచినట్లు సమాచారం. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆరణి శ్రీనివాసులుకు టిక్కెట్ దొరుకుతుందా? అన్న డౌట్ కూడా పార్టీ నేతలే వ్యక్తం చేస్తున్నారు.

## చీరతో పట్టేసే చేప పిల్లలకు భలే డిమాండ్!

కాకినాడ, అక్టోబరు 4,గోదావరి జిల్లాలో పులసకు ఉన్న క్రేజ్ ఎంతో అందరికీ తెలిసిన విషయమే.. కానీ ఇంచుమించు ఈ సీజన్‌లో అంతే క్రేజ్ ఉన్న గోదావరి వంటకం చీరమేను..చీరతో వేటాడే ఈ చేపపిల్లల టేస్ట్ గురించి మాంస ప్రియులు చాలా గొప్పగా చెబుతారు.. గోదావరిలో లభ్యమయ్యే ఈ చీరమేను రేటు కూడా అంతే స్థాయిలో కూడా ఉంటుంది.. ఎందుకంటే ఇది అరుదుగా దొరికే సీజనల్ చీరమేను కావడం దీనికి ప్రధాన కారణం కూడా.. పూర్వ కాలంలో శేరు, తవ్వ, సోల కింద కొలిచి అమ్మే ఈ చీరమేను ఇప్పుడు కిలోల లెక్కన అమ్మకాలు సాగిస్తున్నారు.. ఒక కిలో చీరమేను రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయాలు జరుగుతుండగా పావుకిలో చొప్పున కూడా అమ్మకాలు చేస్తుంటారు స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. తాజాగా చీరమేను సీజన్ కావడంతో పుదుచ్చేరి యానం మార్కెట్‌లో చీరమేను ను కొనేందుకు ఎగబడుతున్నారు నాన్ విజిటేరియన్స్...గోదావరిలో సెప్టెంబరు, అక్టోబర్, నవంబర్ మాసాల్లో చీరమేను అరుదుగా దొరుకుతుంది కాబట్టే దీనికి ఇంత ధర పలుకుతుందంటుంటారు చీరమేను గురించి తెలిసిన వారు.. గోదావరి ప్రవాహం ఓ వైపు, గోదావరిపై వీచే శీతల చల్లగాలులు మరోవైపు ఈ ప్రభావానికి దొందు జాతికి చెందిన చేపపిల్లలు సమూహంగా నీటి ఉపరితలంపై నురగలా తేలుతూ కదులుతుంటాయి.. నీటి అలల తాకిడికి నురగ కూడా తోడవ్వడంతో ఈసమూహాన్ని గుర్తించడం మత్స్యకారులకు చాలా తేలిక అవుతుంది.ఈ సమూహం కదలికను ముగ్గురు కలిసి చీరతో అడ్డుకుని పట్టుకుంటారు.. ఇది గట్టుపైకి తీసుకువచ్చి నీళ్లల్లో కడిగి బకెట్లలో ఉంచుతారు.. వలకు చిక్కని చిన్న చేపపిల్లలు కావడం, సమూహంగా కదలడంతో వలకు చిక్కవు గనుక ఈ చేపపిల్లలను చీరతో మాత్రమే పట్టుకునేందుకు వీలవుతుంది.. అందుకే వీటికి చీరమేను అనే పేరు వచ్చిందంటారు.. అయితే ఇప్పుడు సీడ్ నెట్ అందుబాటులో ఉండడంతో వీటితోనే చీరమేనును పట్టుకుంటున్నారు.గోదావరిలో అరుదుగా దొరికే ఈ సీజనల్ చీరమేను కోసం మాంస ప్రియులు ఎందుకు అంతగా ఎగబడతారు అంటే వీటితో చేసిన వంటకాలు అంత రుచిగా ఉంటాయని చెబుతుంటారు.. చీరమేను చింతకాయ పులుసు, చీరమేను మసాలా కూర, చీరమేనుతో కలిపి వేసిన గారెలు అబ్బో ఆ టేస్టే వేరే లెవెల్ అంటుంటారు గోదావరి ప్రజలు.. ప్రస్తుతం చీరమేను యానాం చేపలమార్కెట్‌లో దొరుకుతోంది.. ధవళేశ్వరం, అంతర్వేది, ఓడలరేవు ఇలా చాలా ప్రాంతాల్లో ఈ చీరమేను లభ్యం అవుతోంది.. కొంతమంది కిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా కొంత మంది కొలతల ప్రకారం అంటే శేరు, తవ్వ, సోల ప్రకారం కొలిచి అమ్ముతున్నారు. ఇక రోజూ జరిగే యానాం చేపల మార్కెట్‌లో నిర్వహించే వేలంపాటలో ఓ బకెట్ చీరమేను రూ.26 వేలు నుంచి రూ.28 వేలు వరకు ధర పలుకుతుండడం విశేషం.. ఇక్కడి నుంచి విదేశాలకు సైతం ప్యాక్‌చేయించుకుని తీసుకెళ్తున్నారు మాంస ప్రియులు..

## గూగుల్ కు అడ్డంకులు... సీఎం సీరియస్

విశాఖపట్టణం, అక్టోబరు 4, విశాఖ నగర అభివృద్ధిపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. అందులో భాగంగా దిగ్గజ ఐటి సంస్థలు విశాఖకు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ప్రధానంగా ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఏపీ ప్రభుత్వం భూమిని కేటాయించేందుకు కూడా సిద్ధపడింది. అయితే గూగుల్ సెంటర్ కు ఇవ్వనున్న భూమికి సంబంధించి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. భూసేకరణను వ్యతిరేకిస్తూ కొంతమంది కోర్టులో కేసులు వేశారు. అయితే రైతులకు తెలియకుండా తప్పుడు కేసులు వేసినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం కఠిన చర్యలకు దిశగా అడుగులు వేస్తోందిఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా చంద్రబాబునువిశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ విమానాశ్రయంలో కలిశారు. గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ పురోగతి, ఆ ప్రాంత రైతుల అభిప్రాయాలను సీఎం చంద్రబాబుకు కలెక్టర్ వివరించారు. అయితే రైతుల ముసుగులో కొంతమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కేసులు వేసినట్లు చంద్రబాబు తెలుసుకున్నారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ఆటంకాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రైతులకు సంబంధం లేకుండానే వారి పేర్లతో కేసులు వేయడం.. అందులో చనిపోయిన ఓ రైతు పేరు ఉండడం పై తీవ్రంగా పరిగణించాలని చంద్రబాబు ఆదేశించారు.

# అరకు పర్యాటకులకు కారివాన్...

విశాఖపట్టణం, అక్టోబరు 4, విశాఖపట్నం పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా 'కారవాన్' వాహనం వచ్చింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో ప్రారంభించగా.. విశాఖపట్నానికి వాహనం చేరింది. విశాఖపట్నానికి చెందిన శివాజీ అనే వ్యాపారవేత్త రూ.1.4 కోట్లతో ఈ వాహనాన్ని సమకూర్చారు. ంఖుఆఅతో ఒప్పందం చేసుకున్న తర్వాత దీనిని నడుపుతారు. త్వరలో టూర్ ప్యాకేజీ వివరాలు ప్రకటిస్తారు. ంఖుఆఅ ఒప్పందంతో ఇది అరకులోయ, పాడేరు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను తీసుకెళ్తుంది.ఆంధ్రప్రదేశ్ టూరిజం ఈ కారవాన్ టూరిజంతో ఒక కొత్త మైలురాయిని చేరుకుంది. పీపీపీ పద్ధతిలో క్యారివ్యాన్ టూరిజంను ప్రారంభించింది. విలాసవంతమైన పర్యాటకాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. విశాఖపట్నం నుండి పర్యాటక ప్రాంతాలకు వెళ్ళడానికి ఒక ప్రత్యేక కారవాన్ సిద్ధం చేశారు. ఈ కారవాన్ సౌకర్యంపై ప్రకృతి ప్రేమికులు చాలా సంతోషంగా ఉన్నారు. ఈ కారవాన్‌లో స్టార్ హోటల్ రేంజ్ సౌకర్యాలతో వివిధ ప్రదేశాలను చూసేందుకు వీలుగా ఉంటుంది. రాష్ట్ర పర్యాటక రంగానికి ఒక మంచి ప్రోత్సాహకమని చెబుతున్నారు.అయితే ఇప్పటికే వీకెండ్‌లో చిన్న, చిన్న కారవాన్లలో వెళ్లడానికి ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. అరకు, పాడేరు, లంబసింగి, వంజంగి, అనంతగిరి, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలకు వెళ్తున్నారు. శనివారం ఉదయం బయల్దేరి, ఆదివారం రాత్రికి తిరిగి వస్తున్నారు. ఐదు నుంచి పది మందికి సరిపడేలా, ఏడు సీట్ల కార్లు, 12 సీట్ల వ్యాన్లను కారవాన్లుగా మార్చుతున్నారు. వీటిలో నిద్రపోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి సోఫాలు, కుర్చీలు ఉంటాయి. కొన్ని చోట్ల మనమే డ్రైవింగ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. కుటుంబంతో కలిసి వెళ్లడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు. పర్యటనకు వెళ్లే వారి సంఖ్యను బట్టి ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయి. గాజువాక, మురళీనగర్, మధురవాడ, బీచ్ రోడ్డు ప్రాంతాల నుండి వీటిని తీసుకోవచ్చు.పర్యటనలకు వెళ్లేవారి కోసం ప్రత్యేక వాహనాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రయాణికులు తమకు నచ్చిన ఆహారాన్ని స్వయంగా వండుకోవచ్చు. ఇందుకోసం వాహనంలోనే స్టవ్, మినీ కిచెన్ ఉంటాయి. కుటుంబ సభ్యులు సరదాగా కూర్చునేందుకు బల్లలు, కుర్చీలు, పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. మ్యూజిక్ నైట్, క్యాంప్‌ఫైర్ వంటి వినోద కార్యక్రమాలు కూడా అందిస్తున్నారు. ప్రయాణ దూరం, ఉండే రోజులను బట్టి రుసుము వసూలు చేస్తారు. వివిధ ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కారవాన్‌లను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.. త్వరలోనే ప్యాకేజ్ వివరాలపై క్లారిటీ వస్తుందంటున్నారు.

# మారనున్న ఆ 26 రోడ్లు

విశాఖపట్టణం, అక్టోబరు 4, విశాఖపట్నంలో రోడ్ల సదుపాయాలను మెరుగుపరిచే దిశగా వీఎంఆర్డీఏ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.174 కోట్లతో ఏడు రహదారులను నిర్మించనుంది. ఈ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలపగా.. వీఎంఆర్డీఏ టెండర్లను కూడా ఖరారు చేసింది. తాజాగా పనులు ప్రారంభించేందుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ రహదారులను భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించే జాతీయ రహదారి మీద ఒత్తిడిని తగ్గించేందుకు నిర్మించనున్నారు. విశాఖపట్నంలో రహదారి మౌలిక సదుపాయాలకు సంబంధించి కీలకమైన అడుగు పడింది. రూ.174 కోట్లతో ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ టెండర్లను ఖరారు చేయటంతో పాటుగా నిర్మాణ పనులను ప్రారంభించింది. 27 కిలోమీటర్ల మేరకు ఈ రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే జాతీయ రహదారిపై ప్రయాణీకుల రద్దీని సులభతరం చేసేందుకు ఈ రోడ్లను నిర్మించనున్నారు.భోగాపురం చుట్టుపక్కల ప్రాంతాలైన భీమిలి, ఆనందపురం, గంభీరం, అడవివరం-సోంత్యం వంటి ప్రాంతాలలో ఈ రోడ్లు నిర్మిస్తున్నారు. వీఎంఆర్డీఏ , జీవీఎంసీ, రోడ్లు, భవనాల విభాగం సంయుక్తంగా ప్రతిపాదించిన 15 రోడ్లలో.. ఈ మేరకు ఏడు రోడ్లకు ప్రభుత్వం నుండి ఆమోదం లభించింది. వీటి పనులకు వీఎంఆర్డీఏ టెండర్లను ఖరారు చేసింది.2024లో విశాఖపట్నంలో జరిగిన సమీక్షా సమావేశంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. కనెక్టింగ్ మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధికి అనుగుణంగా కనెక్టివిటీని మెరుగుపరచాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే కొన్ని నెలల క్రితం, ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. ప్రభుత్వం ఆమోదించింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా వీఎంఆర్డీఏ విశాఖపట్నంను అభివృద్ధి చేస్తుందని ఎటీఖీఆం చైర్మన్ ఎం. ప్రణవ్ గోపాల్ ఇటీవల వెల్లడించారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు కీలకమైన రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.మరోవైపు ఈ ఏడు రోడ్లు త్వరలో అందుబాటులోకి రాబోయే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానించే జాతీయ రహదారి మీద ప్రయాణ ఒత్తిడిని తగ్గించే ముఖ్యమైన మార్గాలు. అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరగా చేరుకోవడానికి ప్రయాణికులకు ఉపయోగపడతాయని అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఈ ఏడు రోడ్లను ఒకే ప్యాకేజీ కింద పూర్తిచేయాలని వీఎంఆర్డీఏను ప్రభుత్వం ఆదేశించింది. వీటి వ్యయం రూ. 100 కోట్లు దాటిన నేపథ్యంలోఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్ట్రక్షన్' కాంట్రాక్ట్ మోడల్ కింద ఏడు రోడ్లకు టెండర్లను ఒకే టెండర్‌గా పిలిచారు. తాజాగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు , వీఎంఆర్డీఏ అధికారులు సింహాచలం సమీపంలోని అడవివరం ప్రాంతంలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు.అడవివరం - గండిగుండం.. చిప్పాడ - పోలిపిల్లి.. నేరెళ్లవలస - తాళ్లవలస.. బోయపాలెం - మంగమారిపేట.. పరదేశిపాలెం - గంభీరం.. శివశక్తి నగర్ - ఉడా హరిత ప్రాజెక్టు.. గంభీరం - హైవే.. వరకు 26 కిలో మీటర్ల మేరకు ఈ రహదారులను నిర్మించనున్నారు. ఇక రహదారుల నిర్మాణంలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోయేవారికి టీడీఆర్ లు ఇస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. నిర్ణీత గడువులోగా ఈ రోడ్లు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# మంత్రులకు ఫుల్ క్లాస్

విజయవాడ, అక్టోబరు 4, కారణాలు ఏమైనా కావచ్చు కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారా? అసెంబ్లీ సమావేశాల్లో కావాలనే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారా? ఇకపై వారి నోటికి కళ్లెం వేయాల్సిందేనా? కేబినెట్ భేటీ తర్వాత సీఎం చంద్రబాబు మంత్రులకు ఏం చెప్పారు? నోరు జారిన ఎమ్మెల్యేలకు తాళం వేయాల్సిందేనని ఎందుకన్నారు? ఇవే ప్రశ్నలు చాలామంది ఎమ్మెల్యేలను వెంటాడుతున్నాయి. బాబు క్లాస్ వెనుక, ఇక వారికి నోళ్లకు తాళం. శుక్రవారం కేబినెట్ భేటీ తర్వాత సీఎం చంద్రబాబు మంత్రులతో కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడారు. ఒకానొక దశలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేస్థాయికి వెళ్లారు. వెంటనే వాళ్లని పిలిపించుకుని మరీ క్లాస్ పీకారు. కేబినెట్ భేటీ తర్వాత కూడా ఇదే విషయంపై రియాక్ట్ అయ్యారు సీఎం చంద్రబాబు. ఇష్టానుసారంగా మాట్లాడే సభ్యులను నియంత్రించాల్సిన బాధ్యత జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులదేని తేల్చిచెప్పారు. ఇన్‌ఛార్జి మంత్రులకు-శాసనసభ్యులకు మధ్య సమన్వయం ఉండాల్సిందేనన్నారు. అది ఎక్కడో మిస్సవుతుందన్నారు. ఆ విషయాన్ని చాలామంది మంత్రులు మర్చిపోయినట్లు ఉన్నారంటూ క్లాస్ తీసుకున్నారు. ఇన్‌ఛార్జుల మంత్రులదే బాధ్యత. జిల్లాల్లో పాలనా వ్యవహారాలు చూడటానికి ఇన్‌ఛార్జి మంత్రులు అవసరం లేదన్నారు. అందుకు కలెక్టర్లు ఉన్నారని అన్నారట. ఎమ్మెల్యేలతో సమన్వయం, పొలిటికల్ మేనేజ్‌మెంట్, కూటమి పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులకు జిల్లాలో ఎమ్మెల్యేలపై నియంత్రణ లేకపోతే ఎలాని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేలు తెలిసో తెలియకో పరిధులు దాటి ఉండవచ్చని, అలా జరగకుండా చూడాల్సింది ఇన్‌ఛార్జి మంత్రులేనన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫ్లోర్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యమని, ఆ బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలన్నది సీఎం మాట. మంత్రులు వారి వారి శాఖలకు సంబంధించి విపక్షాల నుంచి ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ వస్తే వెంటనే వెంటనే కౌంటర్ ఇచ్చేదిగా ఉండాలన్నారు. మంత్రులు తాము ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాలకు ఆటో డ్రైవర్లకు ఆర్థికసాయం పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. కేబినెట్ సమావేశానికి నలుగురు మంత్రులు రాలేదు. వారిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జ్వరంతో బాధపడుతుండడంతో రాలేదు. మరో ఇద్దరు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్ విదేశీ పర్యటనలో ఉన్న విషయం తెల్సిందే. సీఎం చంద్రబాబు.. మంత్రులకు క్లాస్ తీసుకున్న విషయం తెలియగానే కొందరు ఎమ్మెల్యేలు రకరకాలుగా ఆఫ్ ద రికార్డులో చర్చించుకుంటున్నారు. మొత్తానికి ఓవరాల్‌గా పరిశీలిస్తే ఇన్ ఛార్జ్ మంత్రులకు సీఎం చంద్రబాబు ఫుల్ రైట్స్ ఇచ్చినట్టు కనిపిస్తోంది

## మాగుడు గడ్డితో ఉపాధి, ఆదాయం

అనంతపురం, అక్టోబరు 4, మాగుడు గడ్డి కొరతతో సతమతమైన ఇద్దరు రైతులు, ఉమామహేష్, నజీర్‌లు ప్రభుత్వ రాయితీతో మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించారు. ఇది విజయవంతంగా నడుస్తూ, తమ అవసరాలు తీర్చడమే కాకుండా 20 మందికి ఉపాధి కల్పిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుండి భారీ డిమాండ్ ఉంది. ఈ కేంద్రం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతూ, కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు.ఇద్దరు రైతులు తమ పొట్టేళ్లకు మేతకు మాగుడు గడ్డి కోసం ఇబ్బందిపడ్డారు. ఇతర ప్రాంతాల్లో గడ్డి కోసం తిప్పలుపడ్డారు. అప్పుడు స్థానికంగానే ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో, ప్రభుత్వ రాయితీతో యంత్రాలు కొని, మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పుడు వారు దానిని విజయవంతంగా నడుపుతూ.. ఈ కేంద్రం ద్వారా కేవలం తమ అవసరాలు తీర్చుకోవడమే కాదు మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వీరు కూడా ఉపాధి, ఆదాయం పొందుతున్నారు.మాగుడు గడ్డి కోసం మొక్కజొన్న పంటను కోతకు రాకముందే పాల కంకి దశలోనే రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న ఎకరా పంటను రూ.30 వేల నుంచి రూ.42 వేలకు తీసుకుంటారు. ఈ మొక్కజొన్న పంటను యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తారు. అనంతరం దీనికి కొన్ని పోషకాలు కూడా కలుపుతారు.. దానిని మాగుడు గడ్డి బేల్స్‌గా మారుస్తారు. ఈ దీనిని పశువులు, పొటేళ్లకు దాణాగా వినియోగిస్తారు. ఈ మాగుడు గడ్డిని టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ధర పలుకుతుంది.విడపనకల్లు మండలం కరకముక్కలకు చెందిన ఉమామహేష్, పాల్తూరుకు చెందిన నజీర్ మాగుడు గడ్డి ప్రాధాన్యతను గుర్తించారు. వారు ఆరు యంత్రాలు, మూడు ట్రాక్టర్లు కొనుగోలు చేసి, ఏడాదిలో పది నెలలపాటు మాగుడు గడ్డిని ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టగా, రూ.45 లక్షలు రాయితీగా వచ్చింది. ప్రస్తుతం వారు నెలకు రూ.1.20 లక్షలు రుణ ఈఎంఐ చెల్లిస్తున్నారు. దీనితోపాటు, నెలకు రూ.1.5 లక్షలు నిర్వహణ ఖర్చుల కోసం వెచ్చిస్తున్నారు.ఈ మాగుడు గడ్డికి డిమాండ్ కూడా ఉంది.. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు వంటి ప్రాంతాల్లోని రైతులు ఆర్డర్లు పెట్టి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీనిని పశువులు, జీవాల మేతకు ఉపయోగించుకుంటున్నారు. అంతేకాదు అనంతపురం జిల్లా కలెక్టర్ కూడా ఈ మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం గురించి తెలిసి రైతులను అభినందించారు. తాము గతంలో పశువుల, జీవాల మేత విషయంలో ఇబ్బంది పడ్డామని.. ఈ సమస్యకు పరిష్కారంగా ఇలా మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం దిశగా ఆలోచన చేశామన్నారు. తమ ప్రయత్నం ఫలించిందని.. ఈ మాగుడు గడ్డి ఒక బేల్ రెండు నెలలకుపైగా నిల్వ ఉంటుందని.. ఒకవేళ బేల్ విప్పితే వారం మాత్రమే వాడుకోవచ్చని తెలిపారు రైతులు. మొత్తం మీద ఇద్దరు రైతులకు వచ్చిన వినూత్న ఆలోచనతో వారు అవసరాలు తీరడంతో పాటుగా ఆదాయం కూడా వస్తోంది.. అలాగే మరికొందరికి ఈ కేంద్రం ద్వారా ఉపాధి కూడా కల్పిస్తున్నారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం ...

**కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్ ఐపియస్ గారు. జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**



కర్నూలు -ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్ ఐపియస్ గారు, జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారులు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్బంగా ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఒంగోలు " ఆటో డ్రైవర్ల సేవలో ఆనం"

ఒంగోలు, ఒంగోలు ఆటో డ్రైవర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆటో డ్రైవర్ల సేవలో " మెగా ర్యాలీ నిర్వహించారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆటో డ్రైవర్లు ఇచ్చిన ఖాకి చొక్కాను ధరించి ర్యాలీని ప్రారంభించారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ?15,000 ఆర్థిక సహాయం కూటమి ప్రభుత్వం అందిస్తోంది. ఆటో డ్రైవర్లు ఎన్డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఒంగోలు వీధుల్లో ర్యాలీ కొనసాగింది. ఒంగోలు బస్టాండ్ సెంటర్లోని ఆటో స్టాండ్ వద్దనుంచి ర్యాలీ ప్రారంభం అయింది. ప్రకాశం జిల్లా ఇన్చార్జి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేతులమీదుగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభం అయింది. మంత్రి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడివుంది. పేద, మధ్యతరగతి జీవనోపాధికి తోడ్పడే సంక్షేమ పథకాలకు ప్రజల నుండి ప్రశంసల వర్షం కురుస్తోందిని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గోన్నారు. 2025-26 సంవత్సరానికి ఆటో డ్రైవర్ సేవలో ప్రకాశం జిల్లా మొత్తం 11356 మంది లబ్ధిదారులకు 17కోట్ల 3 లక్షల 40 వేల రూపాయల మెగా చెక్కు ను మంత్రి ఆనం అందచేసారు. ఒంగోలు నియోజక వర్గ పరిధిలో 2401 మందికి 3 కోట్ల 60 లక్షల 15 వేల రూపాయల మెగా చెక్కు ను మంత్రి ఆనం అందించారు.

# శ్రీశైలం దేవస్థానంలో బిజెపి సంచలనం

**అభిరుచి మధు పట్టుదలతో మేడా మురళీధర్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు పట్టుదల, కృషి ఫలితంగా శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా బిజెపి నేత మేడా మురళీధర్ నియామకం జరిగింది. ఇప్పటికే ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా క.పోతుగుంట రమేష్ నాయుడు నియమించగా, ఇప్పుడు మురళీధర్ నియామకం బిజెపి శ్రేణుల్లో భారీ సంబరాలకు దారి తీసింది.జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ, పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ ముందుకు తీసుకెళ్తున్న అభిరుచి మధు నాయకత్వం వల్లే ఈ ఘనత సాధ్యమైందని బిజెపి వర్గాలు పేర్కొంటున్నాయి.మేడా మురళీధర్ గతంలో కౌన్సిలర్‌గా పనిచేసి, పార్టీకి విశ్వాసపాత్రుడిగా నిలిచారు. ఊహించని పదవి రావడం అదృష్టమని భావిస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ "పార్టీని నమ్మిన వారికి పదవులు వస్తాయి" అని అన్న మాట నిజమైందని శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇక ఈ నెల 16న శ్రీశైలం రానున్న ప్రధాని నరేంద్ర మోదీ సందర్శనలో మరిన్ని పదవులు రావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అదే సమయంలో శ్రీశైలం అభివృద్ధికి 5 వేల కోట్ల నిధులు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.నంద్యాల జిల్లాలో బిజెపి ఉత్సాహం ఉరకలెత్తుతుందని, ఈ జోష్ వెనుక ఉన్న శక్తి అభిరుచి మధునే అని శ్రేణులు ఘనంగా చెబుతున్నాయి.

# వీల్ చైర్లు అందజేత

**ఆత్మకూరు సుదర్శనం శెట్టి ఉదారత**

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ?**

**రోగుల సౌకర్యార్థం రెండు చక్రాల కుర్చీలు అందజేత**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం రెండు చక్రాల కుర్చీలు అందజేశారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పారిశ్రామికవేత్త ఆత్మకూరు సుదర్శనం శెట్టి, ఆత్మకూరు నాగభూషణం శెట్టి చారిటీ సౌజన్యంతో వీల్‌చైర్లు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మల్లీశ్వరి కి అందించారు.కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుదర్శనం శెట్టి మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీ పెరుగుతుండటంతో చక్రాల కుర్చీలు అత్యవసరం అవుతున్నాయి. రోగుల సౌకర్యార్థం రెండు మడత వీల్‌చైర్లు అందజేయడం సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.డాక్టర్ మల్లీశ్వరి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ తరఫున అందించిన చక్రాల కుర్చీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ జిలాని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు చంద్రమోహన్, పీవీ సుధాకర్ రెడ్డి, అమిదేల జనార్ధన్, మేడం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్ల నిషేధం..

**అవినీతి అధికారుల చేతివాటం**

**మున్సిపల్ తీరుపై ప్రజల మండిపాటు**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-నంద్యాల పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం పేరు చెప్పి అధికారులు సోదాలు చేస్తూ పట్టుబడిన కవర్లను స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే వాటిని తగలబెట్టడం గానీ, పూడ్చేయడం గానీ లేక డంప్ యార్డులో పిండి చేయడం గాని చేయాలి. కానీ ఇవేమీ చేయకుండా తిరిగి రీసైకిల్ అవుతున్నాయనే వార్తలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.అలాగే ప్లాస్టిక్ అమ్మారనే పేరుతో షాపులకు జరిమానాలు వేస్తున్నా, వాటికి లెక్కపెట్టే పద్ధతి మున్సిపల్ కార్యాలయంలో లేదని ప్రజలు ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. "ఈ డబ్బులు ఎక్కడికెళ్తున్నాయి ఎవరి జేబుల్లో పడుతున్నాయిఅని పట్టణ ప్రజలు మండి పడుతున్నారు.ప్లాస్టిక్ నిషేధం అంటే ప్రజలకు ఊరట ఇవ్వాలి. కానీ ఇక్కడ మాత్రం అవినీతి అధికారుల ధన వేటగా మారింది. ఈ దోపిడీని ఆపకపోతే మేమే వీధుల్లోకి వస్తా  అని స్థానికులు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు గట్టిగా కోరుతున్నారు.




# నంద్యాల జిల్లా లో పీసి అండ్ పీఎన్ డీటి చట్టంపై కఠిన చర్యలు

**స్కాన్ సెంటర్ల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ మరియు హై పవర్ మిషన్ వినియోగం తప్పనిసరి**

**డీఎంహెచ్ ఓ డాక్టర్ వెంకట రమణ**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా ఆర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ వీసి అండ్ వీఎన్ డీటి కమిటీ సమావేశం డీఎంహెచ్ ఓ చాంబర్ లో నిర్వహించారు .ఈ సందర్భంగా డా. వెంకటరమణ మాట్లాడుతూ కొత్తగా ప్రారంభమయ్యే స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి 5 సంవత్సరాలకు రిజిస్ట్రేషన్‌ను రీన్యువల్ చేయించాలని, రెన్యువల్ కోసం ఒక నెల ముందే ఆన్లైన్ లో అప్లికేషన్ చేయవలసినదని తెలిపారు. స్కాన్ సెంటర్లపై ప్రోగ్రామ్ అధికారులు మూడు నెలలకు ఒకసారి తనిఖీ నిర్వహించాలని, స్కానింగ్ మిషన్లు మాత్రమే ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల నుండి కొనుగోలు చేయాలని సూచించారు.చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వైద్యులకు మొదటి సారి 10,000 వేలు జరిమానా మరియు 3 సంవత్సరాల జైలు, రెండవ సారి 50,000 వేలు జరిమానా మరియు 5 సంవత్సరాల జైలు, మూడవ సారి వైద్యుల పేరును కౌన్సిల్ నుండి తొలగించడం జరుగుతుందని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. ప్రోత్సాహకులకు కూడా కఠిన చర్యలు ఉంటాయని, రెండోసారి లింగ నిర్ధారణకు ప్రోత్సాహిస్తే 5 సంవత్సరాల జైలు మరియు లక్ష రూపాయల జరిమానా విధించబడుతుందని తెలియజేశారు.అవగాహన కార్యక్రమాల కోసం ఐసీడీఎస్ , మహిళా సంఘాలు, పోలీస్ సిబ్బంది సహకారంతో జిల్లావ్యాప్తంగాచట్టంపె ప్రజలకు అవగాహన కల్పించబడనుంది. సమావేశంలో సీఐ జయం ఎన్ జీ ఓడా. రాజశేఖర్ , ఇంచార్జ్ డెమో కె. రవీంద్ర నాయక్ మరియు వంశీ పాల్గొన్నారు.

# గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు పోరాడుదాం

- కర్నూలుకు తాగునీరు, రైతులకు సాగునీటి అవశ్యకత గుర్తించాలి
- గుండ్రేవుల ప్రాజెక్టు జిల్లాకు గుండెకాయ వంటిది
- నవంబర్‌లో ప్రాజెక్టు సాధనకు కర్నూలులో దీక్ష
- రైతులు, యువత, విద్యార్థులకు కేపియస్ అధినేత ఎం.శ్రీహర్ష పిలుపు



కర్నూలు, అక్టోబర్ 4 : సి.బెళగల్ మండల పరిధిలోని తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి పోరాడుతామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష పిలుపునిచ్చారు. శనివారం ఆయన సి.బెళగల్ మండల కేంద్రంతో పాటు సంగాల గ్రామ రైతులతో గుండ్రేవుల ప్రాజెక్టు ఆవశ్యకతపై చర్చించారు. అనంతరం తుంగభద్ర నది వద్ద గుండ్రేవుల ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా కోడుమూరులోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ప్రజా సంఘాల నాయకులతో సమావేశమై, ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో మన ప్రాంతం ఉందని, ఎందరో హేమాహేమీలు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినా ప్రయోజనం శూన్యమైందని అన్నారు. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న వెనుకబాటుతనానికి ఇప్పటికైనా పాలకులు, ప్రజలు ఒక్కటై మన ప్రాంతం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. వచ్చే నెలలో కర్నూలు నగరంలో ప్రజలు, రైతులు, యువత, విద్యార్థులతో కలిసి గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా కర్నూలు నగరానికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, జిల్లా రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు జిల్లాకు గుండెకాయ వంటిదని, జిల్లా పాలకులు, రైతులు, యువత, విద్యార్థులు అందరూ గుర్తించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కేపియస్ సభ్యులు హరినాథ్ గౌడ్, సి.హెచ్. శ్రీనివాసులు, సురేష్, సోమశేఖర్, వెంకట్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తుంది

**ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం...ఎంపీ బస్తిపాటి నాగరాజు**

కర్నూలు ) -కూటమి ప్రభ ుత్వం సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు... కర్నూలు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్.సిరి కలిసి ఆయన ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కలిపించేందుకు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని తీసుకొచ్చిందన్నారు... గత వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇచ్చి ట్యాక్స్ ల పేరు తో రూ.20 ఎ ే ల ు





లాకుందన్నారు.. ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ఒకో డ్రైవర్ కు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు.. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికి సీ.ఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ వచ్చారన్నారు... ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందిన వారు వాటి గురించి ఇతరులకు తెలియజేస్తు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.. కార్యక్రమంలో పాణ్యం ఎం.ఎల్.ఎ గౌరు చరిత ,డి.సి.ఎం.ఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్ , జెడ్పి సీఈఓ నాసర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, రవాణా శాఖ అధికారులు మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు...

# ఇంటి వద్దకే మనమిత్ర సేవలు

**ఒక్క "హాయ్" తో ప్రభుత్వ సేవలు మీ చేతుల్లో**

**అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-:ప్రజలు ప్రభుత్వం అందించే మనమిత్ర వాట్సాప్ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి అని నంద్యాల అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాన్ తెలిపారు. పట్టణంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు ఈ సేవల ప్రాముఖ్యతను సచివాలయ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. 9552300009 అనే చరవాణి నంబరును మన మిత్ర పేరుతో భద్రపరచుకొని "హాయ్" అని మెసేజ్ పంపితే ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అన్ని రకాల సేవలు ఒక్క క్లిక్ దూరంలో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాలు, ఫిర్యాదులు, పన్నులు, బిల్లులు, ధ్రువపత్రాలు తదితర సౌకర్యాలను ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా పొందవచ్చని అసిస్టెంట్ కమిషనర్ స్పష్టం చేశారు.ప్రజలు డిజిటల్ సేవలను ఎక్కువగా వినియోగించుకోవాలి. మనమిత్ర సేవల ద్వారా పారదర్శకత, వేగవంతమైన సేవలు ప్రజలకు చేరతాయి అని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ హితవు పలికారు.

# టపాసులకు సింగిల్ విండో అనుమతులు:

**జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-నంద్యాల జిల్లాలో ఈ ఏడాది టపాసు విక్రయశాలల ఏర్పాటుకు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు మంజూరు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తెలిపారు.శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తాత్కాలిక టపాసు విక్రయశాలల ఏర్పాటుపై సంబంధిత శాఖాధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫైర్, పోలీస్, రెవెన్యూ శాఖల అనుమతులు ఇకపై ఒకే చోట ? సింగిల్ విండో ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల వ్యాపారులకు సౌలభ్యం కలుగుతుందని చెప్పారు.తాత్కాలిక లైసెన్స్ పొందదలచిన వ్యాపారులు ఈ నెల 15వ తేదీలోపు తమ దరఖాస్తులను సంబంధిత రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు సమర్పించాలన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించి జారీ చేయనున్నట్లు తెలిపారు.టపా తప్పనిసరిగా ఉంచాలి, భద్రతా దూ విక్రయాలు చేయరాదని జాయింట్ జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయ నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, డోన్ పాల్గొన్నారు.



# శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా రేఖగౌడ్..

**- హర్షం వ్యక్తం చేసిన జనసేన నాయకులు కార్యకర్తలు..**

విభారే న్యూస్ అక్టోబర్ 04 ఎమ్మిగనూరు..జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అందించిన సేవలను గుర్తించి పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎమ్మిగనూరు ఇంచార్జీ రేఖగౌడ్ ను శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా ఎంపిక చేయడంపై నియోజక వర్గ జనసేన నాయకులు గానిగ బాషా హర్షం వ్యక్తం చేశారు, అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే రాయలసీమ ప్రాంతంలో కొలువైన శ్రీశైలం మల్లన్న పుణ్యక్షేత్రానికి ఎంతో ప్రత్యేకత ఉందని దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పాలక మండలిలో సభ్యురాలుగా నియమించడం అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మా నాయకురాలు రేఖగౌడ్ కు అందించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నామని జనసేన నాయకులు మాలిక్, నాగేష్, ఖాసిం సాహెబ్, ఉత్తేజ్, వినోద్, మధు, మునిస్వామి, వెంకటేష్, తెలిపారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190